నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 8-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 6 | పేజీలు:4 | వెల: రూ.1/-

చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా ..

జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్



టోక్యో, ఆగష్టు 7:నీరజ్ చోప్రా చరిత్ర సృష్టించాడు. అథ్లెటిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ అందించాడు. టోక్యో ఒలింపిక్స్ జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా సూపర్ షో కనబరిచి స్వర్ణ పతకాన్ని గెలిచాడు. జావెలిన్‌ను అత్యధికంగా 87.58 మీటర్ల దూరం విసిరి టాప్‌లో నిలిచాడు.

అథ్లెటిక్స్‌లో నీరజ్ బంగారు పతకాన్ని అందించి ఇండియాకు చిరస్మరణీయ రోజును మిగిల్చాడు.

తొలి ప్రయత్నంలో అతను 87.03 మీటర్ల దూరం విసిరి టాప్‌లో నిలిచాడు. ఇక రెండో అటెంప్ట్‌లో అతను మరింత పదునుగా త్రో చేశాడు. సెకండ్ అటెంప్ట్‌లో 87.58 మీటర్ల దూరం విసిరి ప్రత్యర్థులకు సవాల్ విసిరాడు. నిజానికి క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఫస్ట్ త్రోతోనే అందరికీ షాకిచ్చాడు నీరజ్. అతని పర్సనల్ బెస్ట్ 88.07 మీటర్లు. దానికి తగినట్లే నీరజ్ టోక్యోలో తన ట్యాలెంట్ చూపించాడు. ముందు నుంచి ఫెవరేట్‌గా ఉన్న నీరజ్.. అనుకున్నట్లే ఇండియాకు ఓ స్వర్ణాన్ని అందించాడు.

పథకం ఏదైనా పేదలకే ప్రాధాన్యం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 7: భారత ప్రభుత్వం కరోనా సంక్షోభాన్ని ఎదుర్కునే వ్యూహంలో భాగంగా అన్ని పథకాల్లో పేదలకే ప్రాధాన్యం ఇస్తున్నదని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. ఇవాళ మధ్యప్రదేశ్‌లో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం అయినా, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ రోజ్‌గార్ యోజన పథకం అయినా మొదటి రోజు నుంచి తాము పేదల ఆహారం, ఉపాధి గురించే ఆలోచిస్తున్నామని చెప్పారు.

దేశంలో 80 కోట్ల మందికిపైగా జనాభా ఉచితంగా రేషన్ పొందుతున్నారని ప్రధాని తెలిపారు. కేవలం బియ్యం, గోధుమలు, పప్పులు మాత్రమే కాదని.. దాదాపు 8 కోట్లకుపైగా మందికి లాక్‌డౌన్ సందర్భంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పారు. అదేవిధంగా 20 కోట్ల మందికిపైగా మహిళల జన్‌ధన్ ఖాతాల్లో 30,000 కోట్ల రూపాయలను జమచేశామన్నారు. అదేవిధంగా ఇటీవల మధ్యప్రదేశ్‌లో కురిసిన వర్షాలు, వరదలపై కూడా ప్రధాని మాట్లాడారు.

రాష్ట్రంలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అతని టీమ్ సమర్థంగా ఎదుర్కొన్నారని ప్రధాని కొనియాడారు. ఈ వరదల్లో కొందరు ప్రాణాలు కోల్పోవడం, పలువురు ఆవాసాలు కోల్పోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఒకప్పుడు మధ్యప్రదేశ్‌లో రోడ్లు అధ్వాన్నంగా ఉండేవని, రోడ్ల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేసేవాళ్లని ప్రధాని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రహదారుల రూపురేఖలు మారిపోయాయన్నారు.

తెలంగాణ చేనేత కళ భారతీయ సంస్కృతికి ప్రతిబింబం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 7: జాతీయ చేనేత దినోత్సవం (ఔజీబితినీనిజీశ్రీ ఊజీనిటశ్రీనీనీఏ ఆజీఎ) సందర్భంగా చేనేత కార్మికులు, పద్మశాలీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ చేనేత ప్రత్యేక కళ భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తున్నదన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంలో చేనేత రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నదన్నారు. మారిన సాంకేతిక యుగంలో పవర్ లూమ్‌లు నడుపుతూ వాటిలో పనిచేస్తున్న నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతున్నదన్నారు. ప్రభుత్వ దార్శనికతతో, మంత్రి కేటీఆర్ కార్యదక్షతతో, గత పాలనలో కునారిల్లిన రాష్ట్ర చేనేత రంగాన్ని అనతి కాలంలోనే పునరుజ్జీవింప చేసుకున్నామన్నారు. చేనేత ఉత్పత్తుల ప్రాధాన్యతను గుర్తించి, ఆదరించి ప్రోత్సహించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు.

చేనేత కార్మికుల్లో ఆత్మస్థైర్యం

చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి, వారిని ఆత్మహత్యలనుంచి దూరం చేసి వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపుతున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు. బతుకమ్మ చీరలు తదితర కార్యక్రమాలతో వారికి చేతినిండా పని కల్పించి, సంపాదన పెంచి, ఆర్థికంగా చేనేత కుటుంబాలకు భరోసానిస్తున్నామన్నారు. వారి ఆత్మగౌరవం పెంచే చర్యలను ప్రభుత్వం చేపట్టిందని సీఎం తెలిపారు.

చేనేత కళాకారులకు సత్కారం

చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులను గుర్తించి సత్కరించుకుంటున్నామని కేసీఆర్ గుర్తు చేశారు. 'కొండా లక్ష్మణ్ బాపూజీ' పేరుతో అవార్డులు అందిస్తున్నామని సీఎం అన్నారు. ఎగ్జిబిషన్లు , ఫ్యాషన్ షోలను నిర్వహిస్తూ చేనేతలకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. రైతు బీమా మాదిరి చేనేత కార్మికులకు బీమా సౌకర్యాన్ని అమలులోకి తేనున్నామన్నారు. చేనేత కార్మికులకు ఫించన్లు ఇస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనన్నారు. చేనేత కార్మికులకు అమలు చేస్తున్న వినూత్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని సీఎం తెలిపారు.

కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలు

చేనేత కార్మికులకు రుణమాఫీ పథకం, నేతన్నలకు చేయూత, చేనేత మిత్ర వంటి పథకాల ద్వారా చేనేత సొసైటీలకు ప్రభుత్వం వాటా ధనాన్ని అందించడం, కార్మికులకు నూలు, రంగులు, రసాయనాలకు సబ్సిడీలు అందించడం, చేనేత మగ్గాలను ఆధునీకరించడం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి విజయవంతగా అమలు చేస్తున్నదని సీఎం తెలిపారు. అవి సత్ఫలితాలనిస్తున్నాయని సీఎం ఆనందం వ్యక్తం చేశారు. పద్మశాలీలను సామాజిక ఆర్థిక రంగాల్లోనే కాకుండా రాజకీయ పాలనా వ్యవస్థల్లో కూడా ప్రోత్సహిస్తున్నామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ నేతన్నలకు దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 7: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి సంవత్సరం జాతీయ చేనేత దినోత్సవాన్ని (ఔజీబితినీనిజీశ్రీ ఊజీనిటశ్రీనీనీఏ ఆజీఎ) తెలంగాణలో ఘనంగా జరుపుకుంటున్నాం అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ నేతన్నలకు దేశంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉందని స్పష్టం చేశారు.

నగరంలోని పీపుల్స్ ప్లాజాలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను (ఔజీబితినీనిజీశ్రీ ఊజీనిటశ్రీనీనీఏ ఆజీఎ) నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. చేనేత కార్మికులకు ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నాం అని తెలిపారు. 2018 నుంచి కొండా లక్ష్మణ బాపూజీ పేరుతో అద్భుతమైన చేనేత కళాకారులను సత్కరించి, అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. అవార్డుతో పాటు నగదు పురస్కారం రూ. 25 వేలను అందించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది 31 మంది చేనేత కళాకారులను సత్కరించుకున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్ నిర్వహించి, చేనేత వస్త్రాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ ప్రత్యేకమైన నైపుణ్యాన్ని దేశ ప్రజలకు తెలియజేసేందుకు ఈ -కామర్స్ ద్వారా ఈ -గోల్కొండ పోర్టల్‌ను రూపొందించుకున్నాం. వీటి ద్వారా చేనేత అమ్మకాలను విక్రయిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాలుగా మన సంప్రదాయాన్ని, సమకాలీన మార్పులను దృష్టిలో ఉంచుకుని.. కొత్తకొత్త డిజైన్లతో ఈతరం, భవిష్యత్ తరం పిల్లలను ఆకట్టుకునే విధంగా డిజైన్లను రూపొందిస్తున్నాం. అలా చేయడం వల్ల పది కాలాల పాటు మనుగడ ఉంటుందనే ఉద్దేశంతో ఫ్యాషన్ షోలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

డబుల్ ఇక్కత్, ఆర్మూర్ పట్టుచీరలు, జరిచీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు తెలంగాణ సమాజంలో అందరి ముందు కదలాడుతున్నాయి. ఆధునికమైన టెక్నాలజీని జోడించి కొత్త డిజైన్లను రూపొందిస్తున్నామని తెలిపారు. కొత్త కొత్త ఆలోచనలతో వచ్చే నేత కళాకారులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమ కోసం పెద్ద ఎత్తున బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నాం. నేతన్నకు చేయూత ద్వారా కళాకారులకు భరోసా ఇస్తున్నాం. చేనేత మిత్ర కింద నూలు, రసాయనాలు, రంగులను 50 శాతం

సబ్సిడీతో కార్మికులకు అందిస్తున్నామని తెలిపారు. నవతరాన్ని ఆకట్టుకునే విధంగా చేనేతలను తీర్చిదిద్దుతున్నాం అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ

జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా చేనేత కళాకారులచే మంత్రి కేటీఆర్ ప్రతిజ్ఞ చేయించారు.

'భారతీయ చేనేత వస్త్రాలు.. కళానైపుణ్యానికి సాంస్కృతిక వారసత్వ సంపదకు ప్రతీకలు. మన ఈ వారసత్వ సంపదను ప్రోత్సహిస్తానని, కాపాడుతానని, ఆదరిస్తానని రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు నేను చేనేత వస్త్రాలను ధరిస్తానని, అలానే నా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ధరించేటట్లు కృషి చేస్తానని జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను'.

తెలంగాణ జీఐ ట్యాగ్ ఉత్పత్తులపై ప్రత్యేక పోస్టల్ కవర్లు విడుదల

హైదరాబాద్ , ఆగష్టు 7:తెలంగాణలో భౌగోళిక గుర్తింపు కలిగిన ఐదు అంశాలపై ఇండియన్ పోస్టల్ తెలంగాణ సర్కిల్ ప్రత్యేక కవర్లను ముద్రించింది. ఈ స్పెషల్ కవర్లను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం ఆవిష్కరించారు. నిర్మల్ ఫర్నిచర్, నారాయణపేట చేనేత చీరలు, వరంగల్ దరీలు, హైదరాబాద్ హలీం, సిద్దిపేట గొల్లభామ చీరల ప్రత్యేకతలపై ఈ కవర్లు ప్రచురించడం అభినందనీయం అని గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి తలసాని

హైదరాబాద్ , ఆగష్టు 7:మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యఅభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మత్స్యకారులపై దాడులకు పాల్పడినా, మత్స్య సంపదకు నష్టం కలిగించినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. మాసాబ్ ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఇవాళ మత్స్యకార సంఘాల ప్రతినిధులతో మంత్రి తలసాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులపై దాడుల నియంత్రణకు, చేపల చెరువుల లూటీలు జరగకుండా అరికట్టేందుకు ప్రభుత్వం సమగ్ర విధానాన్ని తీసుకురానున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు 10 మంది మత్స్యకార ప్రతినిధులతో కమిటీని నియమిస్తూ మంత్రి నిర్ణయం తీసుకున్నారు.

మత్స్యకారులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని గుర్తు చేశారు. రాష్ట్రంలో భారీగా మత్స్య సంపద పెరగడంతో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడిందని చెప్పారు. దళారులకు చేపలు విక్రయించి నష్టపోతున్న మత్స్యకారులను ఆదుకునేందుకు మత్స్య సొసైటీల నుంచి మత్స్య ఫెడరేషన్ ద్వారా నేరుగా చేపల కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. రాష్ట్రం నుంచి ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలకు చేపలను ఎగుమతి చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని మంత్రి తలసాని తెలిపారు.

పోటెత్తిన గంగా నది : వరద తాకిడికి మునిగిన ఘాట్లు

న్యూఢిల్లీ, ఆగష్టు 7: కుండపోతతో పట్నాలో గంగా నది ఉధృతంగా ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తోంది. వరద తాకిడికి కృష్ణ ఘాట్ సహా ఇతర ఘాట్లు మునిగిపోయాయి. వరద పరిస్థితిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద పోటెత్తడంతో పూజలు చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వరద తాకిడితో నీళ్లు కలుషితమయ్యాయని స్థానికులు వాపోతున్నారు. నీటి ప్రవాహం అంతకంతకూ పెరిగిపోతుండటంతో ఇక్కడ బట్టలు ఉతికేందుకు కష్టమవుతోందని స్థానిక రజకులు పేర్కొన్నారు. మరోవైపు పూజ కోసం గంగా జలం సేకరించేందుకు వచ్చే భక్తులు వరదలతో నీరు మురికిగా మారిందని అయినా పూజ కోసం తప్పడం లేదని పేర్కొంటున్నారు. ఇక మరికొన్ని రోజులు బిహార్‌లో భారీ వర్షాలు కురుస్తాయనేందుకు సంకేతంగా భారత వాతావరణ విభాగం యల్లో అలర్ట్‌ను జారీ చేయడంతో స్థానికుల్లో ఆందోళన రేకెత్తుతోంది. ఇక వరద ఉధృతితో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరుతున్నారు.

50 కోట్ల మంది వ్యాక్సిన్ తీసుకున్నారు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 7:శుక్రవారం నాటికి దేశవ్యాప్తంగా 50 కోట్ల మంది కోవిడ్ టీకాలను ఇచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని కల్యాన్ అన్న యోజన లబ్ధిదారులతో ఇవాళ ప్రధాని మోదీ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లో 5 కోట్ల మందికి, దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందినట్లు ఆయన చెప్పారు. పండుగ సీజన్ వేళ భారతీయ చేతివృత్తుల ఉత్పత్తులను ఖరీదు చేయాలని ఆయన సూచించారు. ఇది ఆ రంగానికి చెందిన ప్రజలను ప్రోత్సహిస్తుందన్నారు.

నడిరోడ్డుపై విద్యార్థి సంఘం నేత దారుణహత్య

న్యూఢిల్లీ, ఆగష్టు 7:పంజాబ్‌లోని మొహాలీలో శనివారం మధ్యాహ్నం దారుణం చోటుచేసుకుంది. నడిరోడ్డుపై అకాలీదళ్ విద్యార్థి సంఘం నేత విక్కీ మిద్ధుఖేరను గుర్తు తెలియని దుండగులు కాల్చిచంపారు. ఈ ఘటనపై మొహాలీ ఎస్పీ సతీందర్ సింగ్ స్పందించారు. మతౌర్ మార్కెట్‌కు వచ్చిన విక్కీ కారులో తిరుగు పయనం అవుతుండగా దుండగులు అతడిపై కాల్పులు జరిపారు.

అప్రమత్తమైన విక్కీ కారు దిగి పారిపోయేందుకు యత్నించాడు. అర కిలోమీటర్ వరకు విక్కీ పరుగులు తీశాడు. ఈ క్రమంలో విక్కీని వెంటాడి కాల్పులు జరిపి హత్య చేశారు. కాగా విద్యార్థి నేతను నలుగురు దుండగులు వేటాడి చంపారు. విక్కీపై 8 నుంచి 9 రౌండ్ల కాల్పులు జరిపారు అని మొహాలీ ఎస్పీ పేర్కొన్నారు. కాగా ఈ ఘటనపై విచారణ కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు.

ఇక జోరుగా కరోనా వ్యాక్సినేషన్ : మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 7: రాబోయే రోజుల్లో కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియను ముమ్మరంగా చేపడతామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా శుక్రవారం నాటికి భారత్ 50 కోట్ల వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసి కీలక మైలురాయిని అధిగమించిందని చెప్పారు. మనం ఒక వారంలో పలు దేశాల జనాభా కంటే అధికంగా వ్యాక్సిన్లను వేస్తున్నామని వ్యాఖ్యానించారు. కరోనా మహమ్మారితో వాటిల్లిన కొలువుల నష్టాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.నిర్మాణ, మౌలిక రంగాల్లో ముమ్మర కార్యకలాపాలతో ఉపాధి కల్పన ఊపందుకుంటోందని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు చేయూత ఇస్తున్నామని, రైతులను ఊరట కలిగించే చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రధాని మోదీ శనివారం మధ్యప్రదేశ్‌కు చెందిన పీఎంజీకేఏవై లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో దేశంలో 80 కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్ అందిస్తోందని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదరికం గురించి మాట్లాడటం మినహా వారికి ఎలాంటి సాయం చేయలేదని ప్రధాని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు.

హక్కులు-బాధ్యతల మధ్య సమన్వయం అవసరం: వెంకయ్య

న్యూఢిల్లీ, ఆగష్టు 7:పౌర హక్కులు, సామాజిక బాధ్యతల మధ్య పరస్పర సమన్వయం ద్వారానే దేశాభివృద్ధి వేగవంతం అవుతుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. హక్కులకే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతలను విస్మరించడం ద్వారా సమాజంలో సమన్వయం లోపిస్తుందని గుర్తుచేశారు. జాతీయవాది చమన్‌లాల్ జీ శతజయంతిని పురస్కరించుకుని పోస్టల్ శాఖ రూపొందించిన తపాలా బిళ్లను ఉపరాష్ట్రపతి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన చమన్‌లాల్ సేవలను కొనియాడారు.

స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి జాతి ప్రయోజనాలే పరమావధిగా జీవించాలని ప్రతి నాగరికత, ప్రతి ధర్మం బోధిస్తున్నాయని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, తదనంతర ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ చమన్‌లాల్ జీ తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులను మాతృదేశంతో అనుసంధానమయ్యేలా, వారిలో జాతీయతాభావం పెంపొందేలా విశేష కృషిచేశారని కొనియాడారు. ఎమర్జెన్సీ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వెనక్కు తగ్గకుండా జైలుపాలైన జాతీయవాదుల కుటుంబాలను నిరంతరం పరామర్శిస్తూ వారిలో ధైర్యాన్ని నింపారన్నారు. చమన్‌లాల్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న వెంకయ్యనాయుడు, పాతతరం అనుభవానికి కొత్తతరం ఆలోచనలు తోడైతేనే పురోగతి సాధ్యమని నమ్మేవారని చెప్పారు. విశ్వ అధ్యయన కేంద్రం ఏర్పాటులో చమన్‌లాల్ జీ కీలక పాత్ర పోషించారని, ప్రపంచవ్యాప్తంగా భారతీయతను ప్రతిబింబించే అంశంలో విశ్వ అధ్యయన కేంద్రం చేస్తున్న కృషిని ప్రశంసించారు.

ఉపరాష్ట్రపతి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి దేవ్ సింగ్ చౌహాన్, కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్, పలువురు పార్లమెంటు సభ్యులు, తపాలా శాఖ అధికారులు, విశ్వ అధ్యయన కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్ , ఆగష్టు 7:కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ రాసింది. కేఆర్ఎంబీ చైర్మన్‌కు నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ లేఖ రాశారు. పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీరు తరలించకుండా ఆపాలని కేఆర్ఎంబీకి విజ్ఞప్తి చేసింది. నాగార్జున సాగర్ నీటి అవసరాల కోసం తరలింపును ఆపాలని కోరింది. ఏపీ తన పరిమితికి మించి నీరు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ 25 టీఎంసీల నీటిని తరలించిందని లేఖలో పేర్కొన్నది. నిబంధనల ప్రకారం ఏపీ 10.48 టీఎంసీలే తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. కేఆర్ఎంబీతో పాటు కేంద్ర జలశక్తి శాఖకు కూడా లేఖ ప్రతిని రాష్ట్ర ప్రభుత్వం పంపింది.

బ్యాంక్ ఆఫ్ బరోడాకు బంపర్ లాభం

ముంబై : జూన్ త్రైమాసికం ఫలితాలను బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) (ఔజీనిన నీట ఔజీతీనీటజీ) విడుదల చేసింది. తొలి త్రైమాసికంలో బ్యాంక్ ఆఫ్ బరోడా బంపర్ లాభాన్ని ఆర్జించింది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ నష్టాల నుంచి లాభాలను పొందింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.864 కోట్ల నష్టంతో పోలిస్తే.. ఏప్రిల్ నుంచి జూన్ వరకు బ్యాంక్ రూ.1,208 కోట్ల లాభాన్ని అందుకున్నది. వడ్డీ ఆదాయాలు (ఎన్ఐఐ) 15.7 శాతం పెరిగాయి. ఇది జూన్ త్రైమాసికంలో రూ.7,892 కోట్లుగా ఉన్నది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.6816 కోట్లుగా ఉన్నది. ఎన్పీఏలలో స్వల్ప క్షీణత కనిపించింది.

బ్యాంకు నెట్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్ఎన్పీఏ) మార్చి త్రైమాసికంలో 3.09 శాతంతో పోలిస్తే 3.03 శాతంగా ఉన్నాయి. మరోవైపు, గ్రాస్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (జీఎన్పీఏ) 8.86 శాతంగా ఉండగా.. మార్చి త్రైమాసికంలో 8.87 శాతంగా నమోదయ్యాయి. ఎక్స్పోజర్ ప్రొవిజనింగ్ ప్రకారం, ఆర్గానిక్ రిటైల్ లోన్స్ 11.8 శాతం పెరిగాయి. వాహన రుణాలలో 25 శాతం, వ్యక్తిగత రుణాలలో 19.5 శాతం పెరుగుదల ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు శుక్రవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో 1.27 శాతం పెరిగి రూ.83.50 వద్ద ముగిశాయి.

చరిత్రలో నేటినిజం



భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలు - సవాళ్లు, సాఫల్యాలు

(భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా అభివృద్ధి అవలోకనం

భారతదేశం సగర్వంగా 75 ఏండ్ల స్వాతంత్ర్య దిన వజ్రోత్సవ సంబరాలను 15 ఆగష్టు 2022న ఘనంగా నిర్వహించడానికి ఉవ్విలూరుతున్న శుభ సందర్భమిది. గత ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ యాత్రలో అన్ని రంగాల్లో ఎంతో కొంత అభివృద్ధిని సాధించాం. అనేక ఒడుదొడుగుల నడుమ శతాబ్దాల పోరు ఫలితంగా స్వతంత్ర భరతంలో త్రివర్ణ పతాకం రెపరెరలాడటానికి మిలియన్ల ప్రాణాలను అర్పించాం, ఎన్నటికీ మాయని గాయాలను మోస్తున్నాం. మహాత్మాగాంధీ, నేతాజి, సర్దార్ పటేల్, వీర సావర్కర్, నెహ్రూ లాంటి మహోన్నత నాయకుల కృషి ఫలితంగా స్వేచ్ఛా వాయువులు పీల్చాం. ప్రపంచమంతా నిద్రిస్తున్న ఘడియలో భారతం స్వేచ్ఛ గాలులు పీల్చుకుంటూ మేల్కొని 15 ఆగష్టు 1947న స్వాతంత్ర్యాన్ని పొందాం. నాడు దేశంలో నెలకొన్న అనారోగ్యాలు, నిరక్షరాస్యత, పేదరికం, ఆహార కోరత, ఆర్థిక సామాజిక అసమానతలు లాంటి సమస్యలతో పాటు పెను సవాళ్ల నడుమ మనదైన తొలి ప్రభుత్వం ఏర్పడింది.

పేదరికం :

1947లో 70 శాతం పేదరికం ఉండగా 2011 గణాంకాల ప్రకారం 21.9 శాతానికి తగ్గడం హర్షదాయకమే. 2017 ప్రపంచ బ్యాంక్ అంచనాల ప్రకారం పేదరికం 8.1 - 11.3 శాతం ఉందని తెలియజేసింది. అంతర్జాతీయ నిర్వచనం ప్రకారం వ్యక్తి దినసరి ఆదాయం 1.9 డాలర్ల కన్న తక్కువగా ఉన్నపుడు పేదలుగా వర్గీకరించబడతారు. ప్రపంచ పేదరిక గడియారాన్ని అనుసరించి 2021లో పేదరికం 6 శాతమని తెలుస్తున్నది. గత 75 ఏండ్లలో పేదరిక నిర్మూలనకు మరింత కృషి జరిగే అవకాశం ఉండాల్సిందని నిపుణుల అభిప్రాయం.

నిరక్షరాస్యత :

నాణ్యమైన విద్యను, ముఖ్యంగా బాలికలకు పాఠశాల/ఉన్నత విద్య అందేలా కృషి సరిగా జరగలేదని విశ్లేషిస్తున్నారు. 1947లో అక్షరాస్యత 12 శాతం నుండి నేడు 77 శాతానికి చేరడం కొంత ఊరటను ఇస్తున్నప్పటికీ, అనువర్తిత నాణ్యమైన నైపుణ్యాలతో కూడిన విద్య నేడు కూడా అందని ద్రాక్ష అవుతున్నది. మన విద్య నాణ్యతలు అంతర్జాతీయ ప్రమాణాల స్థాయితో పోల్చితే పాతాళంలో నిలుస్తున్నాయి.

నాణ్యమైన విద్య దొరకనప్పుడు ఆదాయం తగ్గడం, పేదరికం పెరగడం సహజంగా నమోదు అవుతుంది. కరోనా మహమ్మారి విజృంభనతో గ్రామీణ, పట్టణ విద్యార్థులకు మధ్య డిజిటల్ విభేదాలు పెరగడం, గ్రామీణులకు విద్య సక్రమంగా అందక పోవడం జరుగుతోంది. దేశంలో ప్రపంచ స్థాయి ఐఐటిలు, ఐఐయంలు, యన్ఐటీలు, ఐఐయస్సి, ఐఐఐటి, కేంద్ర విశ్వవిద్యాలయాలు నెలకొల్పినా చాలా మంది యువతకు అవకాశం అంతగా లభించడం లేదు. అవిద్య వల్ల సమాజంలో అనేక అనర్థాలు ఉద్భవిస్తున్నాయని అంగీకరించాలి.

ఆహార కొరత :

స్వతంత్ర భారతంలో హరిత విప్లవం ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగి, అత్యధిక బియ్యం దిగుబడి చేసే స్థాయికి చేరడం, ప్రపంచంలోనే 38.5 శాతం బియ్యం ఎగుమతి (17.7 యంయంటి) చేసే స్థితికి ఎదగడం సంతోషదాయకం. బియ్యం ఉత్పత్తి పెరిగిన కొద్దీ భూగర్భజలాలు తగ్గడం చూస్తున్నాం. ఇండియాలో పేదరికం తగ్గడం, ఆహార లభ్యత పెరగడం జరిగినప్పటికీ 80 కోట్ల జనాభాకు నేడు జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా ఉచిత బియ్యం/గోధుమలు పంపిణీ చేయడం చూస్తున్నాం.

భారత ప్రభుత్వం అతి పెద్ద ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణి యంత్రాంగాన్ని కలిగి ఉంది. ధాన్య సేకరణ లోపభూయిష్టంగా, అక్రమాలతో, ఖరీదైనదిగా, అసమర్థ వ్యవస్థ రాజ్యమేలుతున్న వేళ అనేక పారదర్శక సంస్కరణల కోసం నిరీక్షిస్తున్నాం. 2021 ఆర్థిక సంవత్సరంలో 31 శాతం కేంద్ర రెవెన్యూ ఆహార ధాన్యాల సబ్సిడీలకే వెళుతోంది. ఉచితాలను కొనసాగించడానికి బదులు ప్రతి ఒక్కరు స్వావలంభన దిశగా తమ కాళ్ళ మీద తాము నిలబడేలా ప్రభుత్వ పథకాలను పునర్ సమీక్షించాల్సి ఉంది.

ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ :

విశ్వ గురువైన భారత దేశ నాగరికత వికాసంలో పతంజలి, శంకరాచార్య, చరక, సుశ్రూత, ఆర్యభట్టా, వారాహమిహిర లాంటి ఎందరో సనాతన మహానుభావులు ప్రముఖ పాత్రను వహించారు. భారతీయ సనాతన జ్ఞానంతో ఆధునిక అభివృద్ధి వెరుపులు జత కూడితేనే సుసంపన్న, సుభిక్ష భారతం సాధ్యమని తెలుసుకోవాలి. దేశంలోని 138 కోట్ల భారతీయులు రాబోయే 75 వారం పాటు (15 ఆగష్టు 2022 వరకు) మరో నూతన పోరాటం చేయాలని 'ఫ్రీడమ్ స్ట్రగుల్, ఐడియాస్ ఎట్ 75, అఛీవ్‌మెంట్స్ ఎట్ 75, ఆక్షన్స్ ఎట్ 75, రిసాల్వ్ ఎట్ 75' అనబడే పంచ సూత్రాలను అభివృద్ధి మంత్రాలుగా చేసుకొని అభివృద్ధి దిశగా పయనించాలని మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చక్కగా సూచించారు. గత 75 ఏండ్లుగా ముందుకు సాగుతున్న భారతం మరింత వేగంగా అడుగులు వేస్తూ 'ఆజాద్ కా అమృత్ మహోత్సవ్'ను ఘనంగా, సగర్వంగా, సమోన్నతంగా నిర్వహించుకుందాం. 2047లో ఘనంగా నిర్వహించుకునే భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి భారతం శాస్త్రసాంకేతిక సాధనాలతో సమగ్రాభివృద్ధి చెంది, పేదరికం/అవిద్య/నిరుద్యోగం/పోషకాహార లోపం లేని దేశంగా అగ్రరాజ్యాల సరసన చేరాలనే సంకల్పం తీసుకోవలసి ఉంది.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఫాం స్థాయిలో చిన్నతరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగష్టు 7: పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు & పండ్ల ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలతో సహా ఫుడ్ ప్రాసెసింగ్ రంగ సంపూర్ణ అభివృద్ధి కోసం 2016-17 నుంచి ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఒఎఫ్‌పిఐ) కేంద్ర ప్రభుత్వ రంగ గొడుగు పథకమైన ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన (పిఎంకెఎస్‌వై)ను అమలు చేస్తోంది. దాని కింద అమలవుతున్న పథకాలలో భాగంగా, ఎంఒఎఫ్‌పిఐ శాఖ ప్రాసెసింగ్ సౌకర్యాలు, సేకరణ కేంద్రాలు తదితర వ్యవసాయ స్థాయి మౌలిక సదుపాయాలతో ఫుడ్ ప్రాసెసింగ్ / పరిశ్రమల ఏర్పాటు కోసం పారిశ్రామిక వేత్తలకు రుణ ఆధారిత ఆర్థిక సహాయాన్ని (మూల ధన సబ్సిడీ) గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో అందిస్తుంది. ఇప్పటివరకూ, ఆహార ప్రాసెసింగ్, ప్రిజర్వేషన్ సామర్థ్యాలను సృష్టించేందుకు/ విస్తరించేందుకు కాంపొనెంట్ పథకం కింద మొత్తం 292 ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను శాఖ ఆమోదించింది. అంతేకాకుండా, మెగా ఫుడ్ పార్క్ ప్రాజెక్టులలో భాగంగా 116450 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పొడి గిడ్డంగులు (ఉష్ణోగ్రత నియంత్రణ అవసరం లేని), 56520 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజీ గిడ్డంగులను, 1750 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన డీప్ ఫ్రీజ్ గిడ్డంగులు కలిగిన మొత్తం 124 ప్రాథమిక ప్రాథమిక కేంద్రాలకు శాఖ ఆమోదం తెలిపింది.

టమేటో, ఉల్లిపాయి, ఆలుగడ్డ (టిఒపి) నుంచి 22 పాడైపోయే ఉత్పత్తులకు ఆపరేషన్ గ్రీన్స్ పథకం పరిధిని విస్తరిస్తున్నట్టు 2021-2022 బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం ప్రకటించింది. తద్వారా ఈ ఉత్పత్తుల అదనపు విలువను కల్పించడం ఈ పథక లక్ష్యం. మంత్రిత్వ శాఖ మామిడి, అరటి, ఆపిల్, పైనాపిల్, కారెట్, కాలీఫ్లవర్, బీన్స్ తదితరాలు సహా 12 పాడేపోయి, కుళ్ళిపోయే పండ్లు, కాయగూరలను గుర్తించింది.

ఈ సమాచారాన్ని రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు శుక్రవారం లిఖితపూర్వక సమాధానం ఇస్తూ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ వెల్లడించారు.

నానో యూరియా రైతుల పంట దిగుబడిని పెంచుతుంది, నత్రజనిని 50%వరకు ఆదా

న్యూఢిల్లీ, ఆగష్టు 7:పరిమాణ-ఆధారిత లక్షణాలు, అధిక ఉపరితల-వాల్యూమ్ నిష్పత్తి, ప్రత్యేక లక్షణాల కారణంగా మొక్కల పోషణలో నానో-ఎరువులు గొప్ప భరోసాను ఇస్తున్నాయి. నానో-ఎరువులు మొక్క పోషకాలను నియంత్రిత పద్ధతిలో విడుదల చేస్తాయి, అధిక పోషక వినియోగ సామర్థ్యానికి దోహదం చేస్తాయి

వరి, గోధుమ, ఆవాలు, మొక్కజొన్న, టమోటా, క్యాబేజీ వంటి వివిధ పంటలపై 7 ఐసిఏఆర్ పరిశోధనా సంస్థ/రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో నేషనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సిస్టమ్ (నార్స్) ద్వారా రబీ/జైద్ 2019-20 సమయంలో నేనో నైట్రోజన్ (ఇఫ్కో చే అభివృద్ధి చేయబడిన నానో యూరియా) వినియోగించారు. దోసకాయ, క్యాప్సికమ్, ఉల్లిపాయ మొదలైనవి నానో నత్రజని (నానో యూరియా) 50% మేరకు నత్రజని పొదుపుతో పాటు రైతుల పంట దిగుబడిని పెంచగలదని సూచిస్తూ వ్యవసాయపరంగా తగినవిగా గుర్తించబడ్డాయి. నేనో ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) మరియు రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్సిఎఫ్) పిఎస్‌యులు నానో యూరియా ఉత్పత్తి సాంకేతిక పరిజ్ఞానం కోసం ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఐఎఫ్ఎఫ్‌సిఒ) తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఇఫ్కో గుజరాత్‌లోని కలోల్‌లో ఏర్పాటు చేసిన నానో ఫెర్టిలైజర్ ప్లాంట్ సౌకర్యం నుండి తయారైన నానో యూరియా (ద్రవ) ఎగుమతి కోసం ఎరువుల శాఖ నుండి అనుమతి కోరింది. ఈ సమాచారాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవియా రాజ్యసభలో ఈరోజు లిఖితపూర్వకంగా ఇచ్చారు.

డిఏపి, పి అండ్ కె ఎరువుల కోసం ప్రభుత్వం రూ .14,775/- కోట్ల అదనపు నిధులు

న్యూఢిల్లీ, ఆగష్టు 7:ఇటీవల పి అండ్ కె ఎరువులు, పూర్తయిన పి అండ్ కె ఎరువుల తయారీకి ముడి పదార్థాల అంతర్జాతీయ ధరలలో పెరుగుదల ఉంది. ఈ పెరుగుదల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, ప్రభుత్వం డిఏపి, పి అండ్ కె ఎరువుల కోసం రూ .14,775/- కోట్ల అదనపు నిధులను ప్రకటించింది.

కేంద్ర ప్రభుత్వం 20.05.2021 న ఖరీఫ్ సీజన్ 2021 వరకు అంటే అక్టోబర్ 2021 వరకు పి అండ్ కె ఎరువుల కోసం కొత్త ఎన్బిఎస్ రేట్లను నోటిఫై చేసింది. ఇందులో డిఏపి, ఇతర పి అండ్ కె ఎరువుల ఎంఆర్పి సరసమైన ధరల వద్ద ఉంచడానికి పీ అండ్ కె ఎరువులపై సబ్సిడీని పెంచారు. అంతర్జాతీయ ధరల పెరుగుదల కారణంగా తలెత్తే ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

అంతేకాకుండా, యూరియా యొక్క ఎంఆర్పి ని భారత ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్ణయించింది.

45 కిలోల యూరియా బ్యాగ్ యొక్క ఎంఆర్పి రూ.242 బ్యాగ్‌కు (వేప పూత మరియు వర్తించే పన్నులకు సంబంధించిన ఛార్జీలు మినహా) నిర్ణయించింది.

రైతుల కోసం అధిక ఆదాయంపై దృష్టి సారించే అనేక అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు, సంస్కరణలు మరియు విధానాలను స్వీకరించింది కేంద్రం. ఈ విధానాలు మరియు కార్యక్రమాలన్నింటికీ అధిక బడ్జెట్ కేటాయింపులు, బడ్జెట్ లేని ఆర్థిక వనరులు మద్దతు ఇస్తున్నాయి. ఇవి ఇనమ్ మరియు గ్రామ్‌లను బలోపేతం చేయడానికి మైక్రో ఇరిగేషన్ ఫండ్ మరియు అగ్రి-మార్కెటింగ్ పథకాల వంటి కార్పస్ ఫండ్‌లను సృష్టించడం ద్వారా, అలాగే ఫిషరీస్, పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ మరియు పాడి మరియు మత్స్య రంగాలను ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నాయి. రైతుల ఉత్పత్తి వాణిజ్యం (ప్రమోషన్ మరియు ఫెసిలిటేషన్) చట్టం, 2020; ధరల భరోసా మరియు వ్యవసాయ సేవల చట్టం, 2020 పై రైతుల (సాధికారత మరియు రక్షణ) ఒప్పందం; నిత్యావసర వస్తువుల చట్టం, 1955 కి సవరణలు; ఆత్మ నిర్భర్ ప్యాకేజీ (అగ్రికల్చర్) కింద అవసరమైన ఆర్థిక సహాయం 10,000 ఎఫ్పిఓల ప్రమోషన్, పీఎం కిసాన్ కింద అనుబంధ ఆదాయ బదిలీలు; ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్బివై); ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పిఎంకెఎస్వై); ఖరీఫ్, రబీ పంటలన్నింటికీ కనీస మద్దతు ధర పెంపు ఉత్పత్తి వ్యయంపై 50% లాభాన్ని అందిస్తుంది; తేనెటీగల పెంపకం; రాష్ట్రీయ గోకుల్ మిషన్; నీలి విప్లవం; వడ్డీ రాయితీ పథకం; కిసాన్ క్రెడిట్ కార్డ్ (ఐఅఅ) ఇప్పుడు వ్యవసాయ పంటలతో పాటు పాడి ఉ మత్స్యకారుల రైతులకు కూడా ఉత్పత్తి రుణాన్ని అందిస్తుంది

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో

72వ బృందం ఐ.పి.ఎస్ ప్రొబేషనర్ల శిక్షణ ముగింపు కవాతు

న్యూఢిల్లీ, ఆగష్టు 7: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో ఇవాళ ఇండియన్ పోలీసు సర్వీస్ (ఐపీఎస్) 72వ బృందం ప్రొబేషనర్ల శిక్షణ ముగింపు కవాతు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే జాతీయ పోలీసు అకాడమీ డైరెక్టర్ శ్రీ అతుల్ కర్వాల్, ఇతర సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా శ్రీ నిత్యానంద రాయ్ మాట్లాడుతూ- "మనసులోని మాటను నిర్భయంగా వెల్లడించే ఆత్మనిబ్బరంగల అఖిలభారత సర్వీసు లేకపోతే ఐకమత్యం చెదుతుంది... సమైక్య భారతానికి తావులేదు" అన్న భారతదేశపు ఉక్కుమనిషి, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ మాటలను ఉటంకించారు. ఈ నేపథ్యంలో దేశాన్ని సమైక్యంగా ఉంచే దిశగా భారత పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారుల పట్టుదల, అంకితభావం, నిజాయితీ, సహకారాలను అభినందిస్తున్నానని హోంశాఖ సహాయమంత్రి పేర్కొన్నారు. వీటన్నిటికీ దీటుగా క్షేత్రస్థాయిలో నాయకత్వం వహించడమేగాక ఎలాంటి పరిస్థితుల్లోనూ సత్యంవైపు నైతిక వైఖరిని అనుసరించగల స్థైర్యంతో ముందుకు సాగాలని వారికి సూచించారు. ప్రధాని పిలుపునిచ్చిన మేరకు "దేశానికే ప్రాముఖ్యం.. సదా ప్రాథమ్యం" ప్రబోధానికి కట్టుబడి ఉండాలని శ్రీ నిత్యానంద రాయ్ సూచించారు. అదేవిధంగా కేంద్ర హోంమంత్రి ప్రబోధించిన చైతన్య నిండిన పోలీసింగ్ స్ఫూర్తి గురించి వారికి బాగా తెలుసునని, ఆ ఇద్దరు నాయకుల అంచనాలు-ఆకాంక్షలను ప్రొబేషనర్లు అందుకోగలరన్న విశ్వాసం తనకున్నదని పేర్కొన్నారు.

భారత రాజ్యాంగంలో పొందుపరచిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రం విలువలకు అనుగుణంగా పోలీసులు చట్ట పరిరక్షకులుగా ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి పేర్కొన్నారు. సత్యంవైపు నిలిచే సామర్థ్యంతోపాటు పారదర్శకత, నిజాయితీ, అణకువ, సాహసం, అంకితభావం, సమష్టి కృషితోనే ఈ లక్ష్యం సాధ్యంకాగలదని స్పష్టం చేశారు. పోలీసు శాఖకు నిజమైన నాయకులుగా ఎదగాలంటే వారి విలువలు, దృక్పథం, వ్యక్తిత్వం, ప్రవర్తన తదితరాలు అత్యున్నత స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు. అకాడమీలో వృత్తిగత సామర్థ్యాలను పెంపొందించుకున్న నేపథ్యంలో పరివర్తనాత్మక నాయకత్వాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

ప్రజలతో చక్కని సంబంధాల దిశగా సామాజిక పోలీసింగ్ వైపు చురుగ్గా కృషిచేయాలని శ్రీ రాయ్ చెప్పారు. ఎటువంటి చర్యలకు శ్రీకారం చుట్టినా, వాటిని సామాజికంగా మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. మన సమాజంలో మహిళలు, పిల్లలపై నేరాలు నేటికీ ఆందోళనకరంగానే ఉన్నాయని, వీటిని అరికట్టడం వారి ప్రధాన కర్తవ్యంలో కీలక భాగమని ఆయన స్పష్టం చేశారు. తమ కిందిస్థాయి సిబ్బందిలోని పురుషులు, మహిళలందరికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఏడాదికి కనీసం 100 గంటలపాటు శిక్షణ ఇవ్వాలని శ్రీ రాయ్ సూచించారు. తమ దిగువస్థాయి పోలీసు సిబ్బంది సామర్థ్యాలను మెరుగుపరచనిదే అసాధారణ ఫలితాలు సాధించే అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

ఉగ్రవాదం, తిరుగుబాట్లు, మతతత్వం, మత ఛాందసవాదం, వామపక్ష తీవ్రవాదం, సైబర్ నేరాలు, కుట్రలు-కుతంత్రాల వంటివాటిని దేశం నేడు ఎదుర్కొంటున్నదని హోంశాఖ సహాయమంత్రి చెప్పారు. ఇటువంటి ముప్పుల నుంచి ఈ గొప్ప దేశాన్ని రక్షించే కీలక బాధ్యతలను యువ పోలీసు అధికారులు సమర్థంగా నిర్వర్తించగలరని ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రితోపాటు పౌరులందరూ విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విధి నిర్వహణలో భాగంగా జాతి భద్రత కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీసు అధికారులు, సిబ్బందికి దేశం రుణపడి ఉందని శ్రీ రాయ్ అన్నారు. ప్రస్తుత మహమ్మారి పరిస్థితుల నడుమ పోలీసులు కూడా 'ముందువరుస యోధులుగా' తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారని ఆయన అన్నారు. కరోనాపై యుద్ధంలో భాగంగా 2,000 మంది సిబ్బంది ప్రాణత్యాగం చేశారని, విధుల్లో వారి అంకితభావం, చిత్తశుద్ధిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు.

యూనిఫాం ధరించిన ప్రతి అధికారి జీవితంలోనూ శిక్షణ ముగింపు కవాతు ఒక గర్వకారణ అంశమని హోంశాఖ సహాయమంత్రి అన్నారు. జాతి సేవలోకి తొలి అడుగు వేసేముందు విజయసాధన, గౌరవాలను సదా గుర్తుకు తెచ్చే మధుర క్షణాలు ఇవేనని పేర్కొన్నారు. ఈ కవాతులో 33 మంది మహిళా పోలీసు అధికారులు కూడా పాల్గొనడాన్ని ఆయన ప్రస్తావించారు. భారత పోలీసు సర్వీసులో వారు సాధించిన విజయాలపై అభినందనలు తెలిపారు. మరింతమంది మహిళలు ఈ సేవలో ప్రవేశించేందుకు ముందుకొస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో సవాళ్లతో కూడిన శిక్షణ అంకాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ప్రొబేషనర్లందరికీ శ్రీ రాయ్ అభినందనలు తెలిపారు. అలాగే జ్ఞాపికలు, పతకాలు సాధించినవారిని కూడా మంత్రి అభినందించారు. యువ పోలీసు అధికారులు తమ ఆదర్శాలు, ఆశయాలకు అనుగుణంగా నైపుణ్య ప్రమాణాలను నిలబెట్టుకోగలరని హోంశాఖ సహాయ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే దేశవాసులంతా గర్వించే విధంగా భారత రాజ్యాంగంలో పొందుపరచిన విలువలను పాటించాలని ఆకాంక్షించారు.

రాయల్ భూటాన్ పోలీస్, మాల్దీవ్స్ పోలీస్ సర్వీస్, మారిషస్ పోలీస్ ఫోర్స్, నేపాల్ పోలీస్ సర్వీస్‌లకు చెందిన విదేశీ ప్రొబేషనర్లు కూడా ఈ కవాతులో పాల్గొనడం గురించి తెలుసుకుని ఎంతో సంతోషించానని శ్రీ నిత్యానంద రాయ్ చెప్పారు. ఈ చిరస్మరణీయ సందర్భంగా వారికి అభినందనలు తెలుపుతున్నానని, ఈ శిక్షణ కాలంలో ఏర్పడిన స్నేహ సంబంధాల తోడ్పాటుతో మన దేశాల మధ్య సంబంధబాంధవ్యాలు మరింత పటిష్ఠం కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కవాతులో మొత్తం 144 మంది ఐపీఎస్ ప్రొబేషనర్లు పాల్గొనగా, వారిలో 33 మంది మహిళా అధికారులు ఉన్నారు. ఈ ఏడాది తొలి రెండు అగ్రస్థానాలనూ మహిళా అధికారులే కైవసం చేసుకున్నారు. వీరిలో అత్యుత్తమ ఆల్ రౌండ్ ఐపీఎస్ ప్రొబేషనర్ పురస్కారానికి ఎంపికైన రాజస్థాన్ కేడర్ అధికారి కుమారి రంజీతాశర్మకు ప్రధానమంత్రి అధికార దండం - హోం మంత్రి రివాల్వర్‌ను హోంశాఖ సహాయమంత్రి ప్రదానం చేశారు. అలాగే రెండో స్థానంలో నిలిచిన తమిళనాడు కేడర్ అధికారి కుమారి శ్రేయా గుప్తా 'భువనానంద మిశ్రా స్మారక ట్రోఫీ'ని అందుకున్నారు. కాగా, మొత్తం 34 మంది విదేశీ ప్రొబేషనర్లలో నేపాల్ నుంచి 10 మంది, రాయల్ భూటాన్ పోలీస్ నుంచి 12 మంది, మాల్దీవ్స్ పోలీస్ సర్వీస్ నుంచి 7 మంది, మారిషస్ పోలీస్ ఫోర్స్ నుంచి 5 మంది వంతున ఈ కవాతులో పాల్గొన్నారు.

కోవాగ్జిన్ ఉత్పత్తిని ఎక్కువ చేయడానికి భారత్ బయోటెక్,మరో మూడు పిఎస్ఇల విస్తరణకు సహకారం

న్యూఢిల్లీ, ఆగష్టు 7: అభివృద్ధి వ్యయం, మేధో సంపత్తి హక్కులు ఖర్చు, సాంకేతికత, వ్యాక్సిన్ వేదిక, వివిధ కంపెనీలలో ఉత్పత్తి జరుగుతున్న స్థాయి వంటి అంశాలపై ఔషధం /వ్యాక్సిన్ తయారీ వ్యయం ఆధారపడి ఉంటుంది.

బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ ద్వారా అమలు జరుగుతున్న "మిషన్ కోవిడ్ సురక్ష- ఇండియన్ కోవిడ్ -19 వ్యాక్సిన్ డెవలప్‌మెంట్ మిషన్" కింద భారత్ బయోటెక్, మరో మూడు ప్రభుత్వ రంగ సంస్థలు- హాఫ్‌కిన్ బయోఫార్మాస్యూటికల్ కార్పొరేషన్ లిమిటెడ్, ముంబై, ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ హైదరాబాద్; భారత్ ఇమ్యునలాజికల్స్ బయోలాజికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్, బులంద్‌షహర్ లలో కోవాగ్జిన్ ఉత్పత్తిని ఎక్కువ చేయడానికి చేపట్టిన విస్తరణ కార్యక్రమాలకు సహకరిస్తున్నట్లు బయోటెక్నాలజీ విభాగం తెలియజేసింది. రానున్న నెలల్లో కోవాగ్జిన్ ఉత్పత్తిని పెంచాలనే ఉద్దేశ్యంతో హెస్టర్ బయోసైన్సెస్, ఓమ్నిబిఆర్ఎక్స్ బయోటెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, గుజరాత్ బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ (జిబిఆర్సి), గుజరాత్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కలసి ఏర్పాటైన గుజరాత్ కోవిడ్ వ్యాక్సిన్ కన్సార్టియం (జిసివిసి) కి కోవాగ్జిన్ ఉత్పత్తి సాంకేతికతను బదిలీ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు బయోటెక్నాలజీ విభాగం అవసరమైన సహకారాన్ని అందిస్తున్నది.

స్వదేశీ వ్యాక్సిన్ తయారీదారుల కు వ్యాక్సిన్ కొనుగోలు కోసం ఇచ్చిన ఆర్డర్ల పూర్తి విలువను ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అడ్వాన్స్ గా చెల్లించింది. ఈ నిధులను తయారీదారులు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం కోసం ఉపయోగించవచ్చు. కోవిడ్ -19 వ్యాక్సిన్ తయారీలో 'ఏట్-రిస్క్ మాన్యుఫాక్చరింగ్' కోసం ప్రభుత్వం టీకా తయారీదారులలో ఒకటైన మెస్సర్స్ బయోలాజికల్ ఈ సంస్థకు ఆర్థిక సహాయాన్ని అందించింది.

ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ అండ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ క్లినికల్ పరీక్షలు, కోవిడ్ -19 టీకాల కోసం ఆమోదం కోసం అందిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించడానికి ఫాస్ట్ ట్రాక్ వ్యవస్థను ఏర్పాటు చేసింది.

సామాజిక-ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు సురక్షితమైన కోవిడ్ -19 టీకా అందుబాటులో ఉండేలా ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ చర్యలను తీసుకుంటున్నది. టీకా కేంద్రాల సంఖ్యను పెంచడం, కోవిడ్ -19, వ్యాక్సిన్ పై సాధారణ ప్రజల సందేహాలను పరిష్కరించడానికి 24లీ7 నేషనల్ కాల్ సెంటర్ హెల్ప్‌లైన్ కో-విన్ ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్నది. కోవిడ్ -19 టీకా కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు 15 రోజుల ముందుగానే వాటికి సరఫరా చేయనున్న వ్యాక్సిన్ పరిమాణాన్ని తెలియజేస్తున్నది. దీనితో జిల్లాల వారీగా వ్యాక్సినేషన్ కేంద్రాల వారీగా (సివిసి) ప్రణాళికను సిద్ధం చేసి ప్రచారం నిర్వహించడానికి ఈ వ్యూహం అమలు జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో టీకాల కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి ఇది సహకరిస్తుంది. వ్యాక్సిన్ పై విశ్వాసాన్ని పెంపొందించడానికి అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో ప్రచార కార్యక్రమం అమలు జరుగుతున్నది. జాతీయ కోవిడ్ -19 టీకా కార్యక్రమం పురోగతిని అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలతో కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా సమీక్షిస్తుంది.

అర్హులైన లబ్ధిదారులకు కోవిడ్ -19 వ్యాక్సిన్‌లను అందించడానికి దేశంలో ఉత్పత్తి మరియు కోవిడ్ -19 వ్యాక్సిన్ల లభ్యత ను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. . 18 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అర్హులై

పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పుల లేదు.. నేటి రేట్లు ఇవే

న్యూఢిల్లీ, ఆగష్టు 7:సామాన్యులకు చమురు కంపెనీలు ఊరటనిచ్చాయి. గత కొద్ది రోజులుగా పెరుగుతుపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు ప్రస్తుతం నిలకడగా కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా శనివారం పెట్రోల్, డీజిల్ రేటులో ఎలాంటి మార్పు లేదు. పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా మూడు వారాలుగా స్థిరంగానే కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో శనివారం పెట్రోల్ ధర లీటరుకు రూ.105.83గా ఉంది. డీజిల్ ధర రూ.97.96 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. విజయవాడలో పెట్రోల్ ధర రూ.107.64 ఉండగా.. డీజిల్ రేటు లీటరుకు రూ.99.26 వద్ద కొనసాగుతోంది.

నేతన్నకు చేయూత.. కొత్త పథకాలతో చేనేతకు భరోసా: ఎమ్మెల్యే చిరుమర్తి

నల్లగొండ, ఆగష్టు 7: చేనేత పరిశ్రమకు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నకిరేకల్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఒక్కో రంగాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం బలోపేతం చేస్తుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో నేతన్నకు చేయూత పథకానికి ప్రభుత్వం రూ.338 కోట్లు కేటాయించిందని ఆయన గుర్తుచేశారు.

రాష్ట్రంలో రెండో అతిపెద్ద ఉపాధిరంగంగా ఉన్న చేనేత పరిశ్రమను ప్రగతి బాటలో నడిపేందుకు మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చేనేత వస్త్రాలను ధరించాలనిచ్చిన పిలుపుతో రాష్ట్రంలో చేనేత వస్త్ర దుకాణాలు కళకళలాడుతున్నాయని చెప్పారు. నియోజకర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పింఛన్లు అందించేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వాటికి అవసరమైన అదనపు నిధులను కూడా మంజూరు చేయించి నిర్మాణ పనులను చేపడుతామని హామీ ఇచ్చారు.

జాన్సన్ అండ్ జాన్సన్ సింగిల్ డోసు టీకాకు ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 7:జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ సింగిల్ డోసు కోవిడ్ టీకాకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అత్యవసర వినియోగం కింద ఆ టీకాలను ఇవ్వవచ్చు అని ఇవాళ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ తన ట్విట్టర్‌లో వెల్లడించారు. దీంతో భారత్ తన వ్యాక్సిన్ సామర్థ్యాన్ని పెంచేసింది. జాన్సన్ అండ్ జాన్సన్‌కు అత్యవసర వినియోగం కోసం ఆమోదం దక్కడంతో.. భారత్‌లో వినియోగించనున్న అయిదవ టీకా కానున్నది. యురోపియన్ యూనియన్ ఏజెన్సీ ఆమోదం పొందిన 5 టీకాలు మన వద్ద ఉన్నట్లు మంత్రి తన ట్విట్టర్‌లో తెలిపారు. జాన్సన్ సింగిల్ డోసు రాకతో.. కోవిడ్‌పై పోరాటం మరింత బలోపేతం అవుతుందని మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా కోవాక్సిన్, కోవీషీల్డ్, స్పుత్నిక్, మోడెర్నా టీకాల అత్యవసర వినియోగానికి ఆమోదం దక్కిన విషయం తెలిసిందే.

ఆగస్టు 5వ తేదీన సింగిల్ డోసు అప్రూవల్ కోసం జాన్సన్ కంపెనీ భారత ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నది. హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఈ సంస్థతో జాన్సన్ కంపెనీ ఈ టీకాను ఉత్పత్తి చేయనున్నది. సింగిల్ షాట్ వ్యాక్సిన్‌తో కరోనా వైరస్‌ను 85 శాతం సమర్థవంతంగా నిర్మూలించే అవకాశాలు ఉన్నాయి. మూడవ దశ క్లినికల్ ట్రయల్స్‌తో జాన్సన్ టీకా సామర్థ్యం తేలింది. వ్యాక్సిన్ తీసుకున్న 28 రోజుల తర్వాత ఆ టీకా ప్రభావం అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

హసన్‌లో 100 మంది నర్సింగ్ విద్యార్థులకు కరోనా..!

బెంగళూరు, ఆగష్టు 7:: కర్ణాటకలో మరోసారి కరోనా మహమ్మారి కలకలం రేపింది. కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కాలేజీలో శుక్రవారం 21 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్ వచ్చింది. మొత్తం ఆ కాలేజీలోని 48 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 21 మందికి పాజిటివ్‌గా తేలింది. పాజిటివ్ వచ్చిన విద్యార్థులతంగా గత నెల 17 నుంచి 21 నుంచి కేరళ నుంచి వచ్చినవారేనని జిల్లా అధికారులు తెలిపారు. అయితే, కరోనా పాజిటివ్ వచ్చినా వాళ్లలో ఎవరికీ సింప్టమ్స్ లేవని చెప్పారు.

కాగా, ఒకే నర్సింగ్ కాలేజీలో 21 మందికి పాజిటివ్ రావడంతో అధికారులు హసన్ జిల్లాలోని 9 నర్సింగ్ కాలేజీల్లోగల 900 మంది విద్యార్థులకు కరోనా పరీక్షలు చేయించారు. ఆ 900 మందిలో 100 మందికి పాజిటివ్‌గా తేలింది. వారిలో 24 మంది మొదట పాజిటివ్‌గా తేలిన 21 మందికి ప్రైమరీ కాంటాక్ట్స్ అని ఆరోగ్య అధికారి డాక్టర్ విజయ్ వెల్లడించారు. ఆ 24 మంది తొలి డోసు టీకా వేయించుకున్న వారేనని చెప్పారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ, ఆగష్టు 7: దళితబంధు పథకం అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ.. ఎస్సీ కులస్తులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్ పాల్గొన్నారు. అంతకు ముందు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దళితబంధు పథకం అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కొవిడ్ జన్యుపటం, మ్యాథమెటికల్ మోడలింగ్‌ను ఆవిష్కరించనున్న నాలుగు బ్రిక్స్ దేశాల శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, ఆగష్టు 7:చైనా, రష్యా, బ్రెజిల్ శాస్త్రవేత్తల భాగస్వామ్యంతో, సార్స్ కోవ్-2 జన్యువటాన్ని భారత శాస్త్రవేత్తలు ఆవిష్కరించనున్నారు. కొవిడ్-19 వ్యాప్తి, మ్యాథ మెటికల్ మోడలింగ్ పైనా అధ్యయనాలు చేస్తారు. వైరస్ జన్యుపర ఉత్పరివర్తనాలు, పునఃసంయోగాలతో పాటు భవిష్యత్ వ్యాప్తి గురించి తెలుసుకోవడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

వైరస్ జన్యు ఉత్పరివర్తనాలు, పునఃసంయోగాలను గుర్తించడానికి సంపూర్ణ జన్యుపటం అవసరం.

సాంక్రమిక రోగ అధ్యయనాలు దీని వ్యాప్తిని అంచనా వేయడంలో సాయపడతాయి. భవిష్యత్ వ్యాప్తిని అంచనా వేయడానికి మ్యాథమెటికల్ మోడలింగ్ అవసరం.

దీనిని దృష్టిలో ఉంచుకుని; విభిన్న విభాగాల శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల నైపుణ్యాలను ఒకచోటికి చేర్చడం ద్వారా ఒక పరిశోధన ప్రణాళికను రూపొందించారు.

హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ సి హెచ్.శశికళ; బీజింగ్‌లోని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ యుహువా జిన్; రష్యాలోని చెందిన ఫెడమెంటల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఫండమెంటల్ అండ్ ట్రాన్స్‌లేషన్ మెడిసిన్‌కు చెందిన సీనియర్ పరిశోధకుడు ఇవాన్ సోబోలెవ్; బ్రెజిల్‌లోని రెస్పిరేటరీ వైరసెస్ అండ్ మాజిల్స్ లాబొరేటరీకి డా.మరిల్డా మెండోనియా సిక్వేరా ఈ ప్రాజెక్టు సభ్యులు.

భారత్‌కు చెందిన శాస్త్ర, సాంకేతిక విభాగం ఈ పరిశోధనకు సాయం చేస్తుంది. వ్యర్థ జల ఆధారిత అంటువ్యాధి (డబ్ల్యూబీఈ) పరిశోధన కోసం, మెటాజినోమ్ విశ్లేషణ ద్వారా పర్యావరణ నమూనాల్లో సార్స్ కోవ్-2 వ్యాప్తిని బ్రెజిల్ వైపు నుంచి అంచనా వేస్తారు. శ్వాసకోశ వ్యాధుల లక్షణాలు ఉన్న రోగుల నుంచి తీసిన నమూనాల్లో సార్స్ కోవ్-2 రియల్ టైమ్ పీసీఆర్ గుర్తింపును చైనా, రష్యా శాస్త్రవేత్తలు చేపడతారు. జన్యు వైవిధ్యం, పరిణామ అభివృద్ధి విశ్లేషణను పరిశీలిస్తారు.

వైరస్ మ్యాథమెటికల్ మోడలింగ్‌ను అభివృద్ధి చేయడానికి భారత్, చైనా, రష్యా, బ్రెజిల్ నుంచి వచ్చే జన్యు సంబంధ, మెటాజెనోమిక్, ఎపిడెమియోలాజికల్ సమాచారాన్ని కలిపి సమగ్ర పరుస్తారు. వైరస్ వ్యాప్తి మార్గాలు, మనుగడను గుర్తించడానికి ఇది సాయపడుతుంది. వివిధ విభాగాల ద్వారా అభివృద్ధి చేసిన సమాచారాన్ని వివిధ ప్రాంతాల్లో వైరస్ వ్యాప్తి, మనుగడతో పోల్చి చూస్తారు. సంబంధిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై సర్వైవలెన్స్ ఏర్పాటు చేస్తారు.

చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రోబయాలజీ, ఫెడరల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఫండమెంటల్ అండ్ ట్రాన్స్‌లేషన్ మెడిసిన్ ఆఫ్ రష్యా, బ్రెజిల్‌కు చెందిన రెస్పిరేటరీ వైరస్ అండ్ మీజిల్స్ లాబొరేటరీ నుంచి అంతర్జాతీయంగా ఉన్న సహకారాలను పరిగణనలోకి తీసుకుని, ఈ సహకార పరిశోధన ప్రణాళికను అభివృద్ధి చేశారు. నాలుగు విభిన్న దేశాల సమాచారాన్ని పంచుకోవడానికి, విశ్లేషించడానికి, వైరస్ వ్యాప్తి మార్గాలు, మనుగడను అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం ఒక ఉమ్మడి వేదికను అందిస్తుంది.

స్వయం ఉపాధిపై గ్రామీణ యువతకు 87 సమీకరణ శిబిరాల నిర్వహణ!

న్యూఢిల్లీ, ఆగష్టు 7:దేశం స్వాతంత్ర్యం సాధించి 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' పేరిట భారత ప్రభుత్వం నిర్వహించే వేడుకల్లో భాగంగా దేశంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలు (ఆర్.ఎస్.ఇ.టి.ఐ.లు) 2021 జూలై 30నుంచి ఆగస్టు 5వరకూ దేశవ్యాప్తంగా 87 'సమీకరణ శిబిరాల'ను నిర్వహించాయి. ఆజాదీ అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలను జన ఉత్సవాలుగా, జనోద్యమాలుగా ప్రజా భాగస్వామ్య (జన భాగీర్దారీ) స్ఫూర్తితో దేశం నలుమూలలా నిర్వహించబోతున్నారు.

అమృత్ మహోత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా 19 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 87 జిల్లాల్లో మొత్తం 87 సమీకరణ శిబిరాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఈ సమీకరణ శిబిరాల్లో పాల్గొన్న వారందరికీ స్వయం ఉపాధికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, మాస్కులు, రేషన్ సరకుల పంపిణీ తదితర కార్యకలాపాలనుంచి తాము ఎంపిక చేసుకోవలసిన అంశాలపై శిబిరాల్లో పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆర్.ఎస్.ఇ.టి.ఐ.ల ఆధ్వర్యంలో 37.81లక్షలమందికి 64 అధ్యయన కోర్సుల్లో శిక్షణ కల్పించారు. ఈ కోర్సుల్లో జాతీయ నైపుణ్య అర్హతా ప్రమాణాల వ్యవస్థ (ఎన్.ఎస్.క్యు.ఎఫ్.)కు అనుసంధానమైన 59 కోర్సులు, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆమోదించిన 5 కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సుల ద్వారా 26.65లక్షల మంది గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర అభ్యంతర్థులు స్వయం ఉపాధిలో ప్రభుత్వాలు, స్పాన్సార్డ్ బ్యాంకులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటాయి. గ్రామీణ యువత తమంతట తాముగా సొంతంగా ఉపాధిని కల్పించుకునేందుకు, ఔత్సాహిక వాణిజ్య సంస్థలను నెలకొల్పుకొనేందుకు వీలుగా తగిన శిక్షణ ఇచ్చేందుకు వీలుగా బ్యాంకులు తప్పనిసరిగా తమ లీడ్ జిల్లాకు ఒకటి చొప్పున ఆర్.ఎస్.ఇ.టి.ఐ.లను ప్రారంభించాలన్న నిబంధన విధించారు. వివిధ ఔత్సాహికుల మద్దతు, మార్గదర్శకత్వంలో స్వల్ప వ్యవధి శిక్షణ లక్ష్యంగా ఆర్.ఎస్.ఇ.టి.ఐ. ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18-45 సంవత్సరాల పేద యువత ఈ శిక్షణా కార్యక్రమాలకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదవర్గాలకు చెందిన యువజనుల ఆశలను నెరవేర్చడం, వారికి వివిధ రంగాల్లో శిక్షణ అందించి, ఔత్సాహిక వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాల నిర్వహణలో ఆర్.ఎస్.ఇ.టి.ఐ.లు ఇప్పటికే తమ సత్తాను నిరూపించుకున్నాయి. ఈ శిక్షణా కార్యకలాపాల కోసం సమీకరణ శిబిరాలు చాలా ముఖ్యమైన భూమికను పోషిస్తున్నాయి. అర్హులైన అభ్యర్థులను చేరుకుని, ఈ పథకం గురించి, అవకాశాల గురించి వారికి తెలియజెప్పడానికి ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయి.

త్వరలో కేసీఆర్ కేబినెట్ విస్తరణ.. దళిత వర్గానికి డిప్యూటీ సీఎం పదవి!

హైదరాబాద్ , ఆగష్టు 7:తెలంగాణ మంత్రివర్గ విస్తరణ త్వరలో జరగనుంది. తాజా కేబినెట్ విస్తరణలో దళిత వర్గానికి చెందిన వ్యక్తికి డిప్యూటీ సీఎం పదవి దక్కనుందని సమాచారం. హుజురాబాద్ ఉప ఎన్నిక కంటే ముందే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. దళితుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళిత బంధు పథకాన్ని అమలు చేస్తోంది. అయితే, ఎస్సీలపై అంత ప్రేమ ఉంటే.. దళితులని డిప్యూటీ సీఎంగా ఎందుకు చేయరని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. కేవలం హుజురాబాద్ ఎన్నికల కోసమే దళిత బంధు పథకం అంటూ విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలకు కౌంటర్ గా దళితులకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు సమాచారం. టీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో దళిత వర్గానికి చెందిన టి.రాజయ్య, కడియం శ్రీహరిలు డిప్యూటీ సీఎంలుగా పని చేశారు. అయితే, అనంతరం రాజయ్య ఆ పదవిని కోల్పోయారు.

వైద్య శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ ను బర్తరఫ్ చేసిన తర్వాత ఆ శాఖను సీఎం కేసీఆర్ తన వద్దే ఉంచుకున్నారు. ఈటల బీజేపీలో చేరిన అనంతరం సీఎం కేసీఆర్ తన కేబినెట్‌లో మార్పులు, చేర్పులు చేయబోతున్నారనే చర్చ జరుగుతోంది. టీఆర్ఎస్ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చాక.. దాదాపు రెండేళ్ల తర్వాత సీఎం కేసీఆర్ మంత్రి వర్గాన్ని పునర్వవస్థీకర చేయనున్నారు. ఈసారి ఖచ్చితంగా పదవులు పదేరం ఉంటుందనే చర్చ ఊపందుకుంది. కొందరు మంత్రుల పనితీరుపై సీఎం కేసీఆర్ అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో వారిని మంత్రి పదవుల నుంచి తప్పించి.. కొత్త వారికి అవకాశం కల్పించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కేసీఆర్ ఇచ్చిన టాస్క్ పూర్తి చేసిన వారికి, పార్టీకి విధేయులుగా ఉన్న వారికి పదవులు కట్టబెడుతారని గులాబీ వర్గాలంటున్నాయి.

రాష్ట్రంలో దళిత జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీలు కనీసం ముగ్గురు మంత్రులు కేబినెట్ లో ఉండాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను డిప్యూటీ సీఎం పదవికి ప్రమోట్ చేయాలి లేదా మరొక ఎస్సీ నాయకుడికి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుడిని సీఎంగా చేస్తానన్న కేసీఆర్.. మాట తప్పి దళితులకు ద్రోహం చేశారని విమర్శించారు. దళితుల అభివృద్ధి అంటున్న కేసీఆర్.. తన కేబినట్ లో డిప్యూటీ సీఎం పదవి ఇవ్వలేదని కాంగ్రెస్ నేత జీవర్ రెడ్డి స్వైత ప్రశ్నించారు. కొప్పుల ఈశ్వర్ లాంటి వారిని డిప్యూటీ సీఎంగా ఎందుకు చేయలేదని నిలదీశారు. ప్రతిపక్షాల నుంచి ఈ తరహా డిమండ్ అధికం అవ్వడంతో సీఎం కేసీఆర్ మంత్రివర్గాన్ని విస్తరించాలని భావిస్తున్నట్లు ఉహాగానాలు వినిపిస్తున్నాయి.

మరోవైపు బీసీ వర్గానికి చెందిన ఈటలను బహిష్కరించడంతో.. అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో భర్తీ చేస్తారనే టాక్ కూడా వినిపిస్తోంది. కేసీఆర్ మంత్రివర్గంలో మొత్తం నలుగురు బీసీ మంత్రులు ఉండగా.. ఈటల బర్తరఫ్ తో ఆ సంఖ్య మూడుకు చేరింది. బీసీ వర్గానికి చెందిన తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ లు కేబినెట్ మంత్రులుగా కొనసాగుతున్నారు. ఇక, కమ్మ (పువ్వాడ అజయ్ కుమార్), ఎస్టీ (సత్యవతి రాథోడ్), ఎస్సీ (ఈశ్వర్) ముస్లిం (మహ్మద్ మహమూద్ అలీ) వర్గాల నుండి ఒక్కొక్క మంత్రి ఉన్నారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన కేసీఆర్, కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు మొత్తం నలుగురు కేబినేట్ లో ఉండగా.. రెడ్డి వర్గానికి చెందిన ఆరుగురు మంత్రులు కొనసాగుతున్నారు. అందులో ఇంద్రకరణ్ రెడ్డి, జగదీష్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లా రెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలు రెడ్డి సామాజిక వర్గం కోటాలో మంత్రులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తర్వలో జరిగే మంత్రివర్గ విస్తరణ ఎవరికి చాన్స్ దక్కుతుందని అనేది ఉత్కంఠగా మారింది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకు ఎస్సీలకు డిప్యూటీ సీఎంగా ఛాన్స్ ఇస్తారా? అన్నది ఆసక్తి రేపుతోంది.

ఉపఎన్నిక షెడ్యూల్‌పై పార్టీలకు సంకేతాలందాయా?

హైదరాబాద్ , ఆగష్టు 7:హుజూరాబాద్ ఉపఎన్నిక షెడ్యూల్ మరో వారం రోజుల్లో వెలువడనుందా? ఈ మేరకు ప్రధాన రాజకీయ పార్టీలకు సంకేతాలందాయా? వారం రోజులుగా ముమ్మరంగా సాగుతున్న ఆయా పార్టీల కార్యకలాపాలు దీన్ని బలపరుస్తున్నాయి. ఈనెల 16న సీఎం కేసీఆర్ హుజూరాబాద్‌లో దళితబంధు పథకం ప్రారంభిస్తారని తొలుత ప్రకటించారు. అయితే పథకాన్ని ఆగస్ట్ 5 నుంచే అమలు చేస్తున్నారు. వాసాలమర్రి దళితవాడను సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు దళితబంధు లబ్దిదారులకు విడుదల చేయడం చూస్తే.. హుజూరాబాద్ ఉపఎన్నిక షెడ్యూలు విడుదల సంకేతాలందడమే కారణమనే ప్రచారం సాగుతోంది.

టీఆర్ఎస్ లో పాడి కౌశిక్‌రెడ్డి , మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేరికలకు సీఎం కేసీఆర్ స్వయంగా హాజరవడం , కౌశిక్‌రెడ్డిని గవర్నర్ కోటాలో శాసనమండలికి నామినేట్ చేయడం వంటి పరిణామాలు వేగంగా చోటుచేసుకున్నాయి. మంత్రి హరీశ్‌రావు హుజూరాబాద్‌లో పార్టీ సమన్వయంపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టారు. మరో మంత్రి గంగుల కమలాకర్ , ఇతర ఎమ్మెల్యేలు హుజూరాబాద్‌లోనే మకాం వేశారు. దీనికంతటికీ ఉపఎన్నిక షెడ్యూలుపై సంకేతాలు రావడమే కారణమని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్టీ అభ్యర్థిగా గెల్లు శ్రీనివాస్ బరిలో దింపనుందని ప్రచారం జరుగుతోంది. సర్వే రిపోర్టు ఆధారంగా ఆయనను సీఎం కేసీఆర్ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.పాదయాత్రలో అస్వస్థతకు గురైన మాజీ మంత్రి ఈటల రాజేందర్.. ఆగిన చోటు నుంచే తిరిగి పాదయాత్ర పునః ప్రారంభించాలని యోచిస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఇటీవల ఈటల డిశ్చార్జ్ అయ్యారు. ఆయన కోలుకునేందుకు వారం, పది రోజులు పడుతుందని సన్నిహితులు అంటున్నారు. అయితే , ఈటల మాత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కాగానే నేరుగా హుజూరాబాద్ వెళ్లారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడకుండానే ఈటల హుటాహుటీన నియోజకవర్గానికి వెళ్లడం వెనుక ఉపఎన్నిక షెడ్యూలు వార్తలే కారణమని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా హుజూరాబాద్ ఉపఎన్నికపై చర్చించింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన పార్టీ నేతలు అభ్యర్థి విషయంపై సమాలోచనలు చేశారు. అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలని? అనేదానిపై నేతల అభిప్రాయాలు తీసుకుంటున్నారు. మూడు ప్రధాన పార్టీల్లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో హుజూరాబాద్ ఉపఎన్నిక షెడ్యూలు వారాంతంలోగా వెలువడుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నారు.

కేటాయించిన శాఖలపై కర్ణాటక మంత్రి ఆనంద్ సింగ్ అసంతృప్తి

బెంగళూరు, ,ఆగష్టు 7:: తనకు కేటాయించిన శాఖలపై కర్ణాటక మంత్రి ఆనంద్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను కోరిన మంత్రిత్వ శాఖలు దక్కలేదని, పార్టీ ఫోరమ్‌లో తాను చేసిన అభ్యర్థన ఏదీ పరిగణించలేదని ఆయన వాపోయారు. ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్, టూరిజం శాఖలు తనకు ఇవ్వడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోర్ట్‌ఫోలియోలను తాను కోరలేదన్నారు. సీఎం బసవరాజ్ బొమ్మైను కలిసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. తన అభ్యర్థనను పునఃపరిశీలించాలని సీఎంను కోరుతానని మంత్రి ఆనంద్ సింగ్ తెలిపారు.కాగా, బీజేపీ ఎమ్మెల్యేలో తనపై అసంతృప్తి నేపథ్యంలో జూలై 27న సీఎం పదవికి యెడియూరప్ప రాజీనామా చేయగా, జూలై 28న కొత్త సీఎంగా బసవరాజ్ బొమ్మై ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రెండు రోజులకు 29 మంది మంత్రులతో కేబినెట్‌ను ఆయన విస్తరించారు. అయితే తమకు దక్కిన శాఖలపై కొందరు మంత్రులు అసంతృప్తితో ఉన్నారు. ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్, టూరిజం శాఖల మంత్రి ఆనంద్ సింగ్ తన ఆవేదనను శనివారం బహిరంగంగా వ్యక్తం చేశారు. శాఖల మార్పుపై సీఎం బొమ్మైని కలిసి మాట్లాడతానని చెప్పారు.

శాంతించిన కృష్ణమ్మ.. తగ్గిన వరద ఉధృతి



హైదరాబాద్ , ఆగష్టు 7:కృష్ణానదికి వరద తగ్గుముఖం పడుతున్నది. శ్రీశైలం జలాశయానికి 58,629 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్ ఫ్లో 1,20,088 క్యూసెక్కులుగా ఉన్నది. ప్రస్తుతం రెండు గేట్లు పది అడుగులు ఎత్తి.. నీటిని దిగువకు వదులుతున్నారు. డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.50 అడుగులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలకు గాను ఇప్పుడు 212.4385 టీఎంసీల నీరుంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. ఇక, నాగార్జున సాగర్ కు 66,057 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. అదేస్థాయిలో ఔట్ ఫ్లో ఉన్నది. గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులకు గాను ప్రస్తుతం 580.70 అడుగులుంది. ప్రస్తుతం 311.1486 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

తెలంగాణలో 577 మందికి కరోనా

హైదరాబాద్ , ఆగష్టు 7:తెలంగాణలో గడచిన 24 గంటల్లో 1,11,226 కరోనా పరీక్షలు నిర్వహించగా, 577 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో 645 మంది కరోనా నుంచి కోలుకోగా, ఇద్దరు మరణించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 79 కేసులు నమోదు కాగా, కరీంనగర్ జిల్లాలో 66 కేసులు గుర్తించారు.ప్రస్తుతం 8,674 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

రాష్ట్రంలో ఇప్పటిదాకా 6,48,388 పాజిటివ్ కేసులు నమోదు కాగా? 6,35,895 మంది ఆరోగ్యవంతులయ్యారు. కరోనా తో మృతుల సంఖ్య 3,819కి చేరింది.

9న భరోసా సెంటర్, టీటీఐ ప్రారంభోత్సవం : డీఐజీ రంగనాథ్

నల్లగొండ, ఆగష్టు 7: జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌లో నిర్మించిన భరోసా కేంద్రం, జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్మించిన ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్లను ఈ నెల 9వ తేదీన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు డీఐజీ ఏవీ రంగనాథ్ తెలిపారు.

ఈ రెండు ప్రారంభోత్సవాలకు తెలంగాణ శాసన మండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థాని

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 7: చేనేత వస్త్రాల వల్ల ఆరోగ్యంతో పాటు, ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న ఎక్స్‌పో ప్లాజాలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

చేనేత వస్త్రాలు ధరించడం వల్ల చర్మ వ్యాధులు రావని, అంతేకాక శరీరాన్ని చల్లగా ఉంచుతాయని మంత్రి అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత రంగాన్ని, కార్మికులను కాపాడాలని, చేనేతలకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. చేనేతలకు ప్రోత్సాహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చేనేత వస్త్రాలను పంపిణీ చేస్తున్నదని తెలిపారు. జిల్లా కేంద్రంలో టెస్కో షోరూమ్ తో పాటు బ్రాంచీలు కూడా ఏర్పాటు చేసే విషయంపై దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కు మంత్రి శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ.. మన వస్త్రాలు మన సంస్కృతికి నిదర్శనమని, మన సంస్కృతిని మనం కాపాడుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలు ధరించాలని కోరుతూ కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం ఎక్స్ పో ప్లాజా నుండి తెలంగాణ చౌరస్తా వరకు చేనేత కార్మికులతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నరసింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, డీసీసీబీ ఉపాధ్యక్షులు వెంకటయ్య, చేనేత శాఖ సహాయ సంచాలకులు బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, కృష్ణ మోహన్, చేనేత సంఘాల అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, రాములు, కృష్ణయ్య,తదితరులు పాల్గొన్నారు

నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి ప్రోత్సహించాలి.
-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి): నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.

శనివారం జాతీయ చేనేత దినోత్సవంను పురస్కరించుకొని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తో కలిసి సంక్షేమ శాఖ మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఉండేవని అన్నారు . తెలంగాణ ఉద్యమ సమయంలోనే నేతన్నల ఆకలి చావులు ఆపుటకు వారిలో ఆత్మస్థైర్యం కల్పించుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు అప్పుడే ప్రణాళికలు తయారు చేశారని తెలిపారు . తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి చేనేత కార్మికులకు నూలు కొనుగోలుపై సబ్సిడీ, పవర్ సబ్సిడీ , ఇతర అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తద్వారా చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆగిపోయాయని అన్నారు. చేనేత కార్మికులలో ఆత్మస్థైర్యం కలిగిందని తెలిపారు .చేనేత కార్మికులకు ఉపాధి కల్పించుటకు చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. దసరా ,రంజాన్ , క్రిస్టమస్ పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి 50 లక్షల మంది పేద ప్రజలకు కానుకలుగా అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలని మంత్రి కోరారు.రాష్ట్ర పౌర సరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు . నేత కార్మికుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేనేత బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు . భారతదేశంలో అత్యధిక చేనేత కార్మికులు కరీంనగర్ జిలాలోనే ఉన్నారని మంత్రి తెలిపారు .చేనేత కార్మికులలో గొప్ప నైపుణ్యం ఉందని , నేతన్నలు మగ్గం పై ఏక కాలంలో తన ప్రతి అవయవం పని చేస్తేనే ఒక వీరే, ఒక ఒక దోతి తయారవుతుందని అన్నారు . తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నేతన్నల ఆత్మహత్యలు జరిగేవని రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలతో నేతన్నల ఆత్మహత్యలు ఆగిపోయాయని తెలిపారు . ప్రభుత్వం టర్న్ టు ఫండ్ కింద నిధులు విడుదల చేసిందని తెలిపారు. చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి తెలిపారు . కరీంనగర్ లో ఒక ఎకరం స్థలంలో నేతన్న భవనం నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఆర్వి కర్ణన్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చేనేత మిత్ర పథకం, నూలు కొనుగోలుపై సబ్సిడీ, నేత బజార్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు .నేత కార్మికులను ప్రోత్సహించుట కు ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలని కలెక్టర్ కోరారు.అనంతరం 19 చేనేత సహకార సంఘాలకు 81 లక్షలు, 17.71 లక్షల పావలా వడ్డీ రుణాల చెక్కు లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాలు బిసి సంక్షేమ శాఖ మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారుఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ , నగర మేయర్ వై .సునీల్ రావు, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు జి .సంపత్ , కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు , పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు మెతుకు సత్యం, గౌరవ అధ్యక్షులు వాసాల రమేష్, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు సభ్యులు సత్యనారాయణ చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు

ప్రధాని సిబ్బందిలో ఒకరికి కరోనా.. అయినా ప్రధానికి ఐసోలేషన్ అక్కర్లేదట..!

లండన్ ఆగష్టు 7:: బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ (ఃనీతీబ ఏనీష్ణనిబనీని) సిబ్బందిలో ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చింది. గత బుధ, గురు వారాల్లో అధికారిక పర్యటనల్లో భాగంగా ప్రధాని బోరిస్ జాన్సన్‌తో కలిసి తిరిగిన సిబ్బందిలో ఒకరికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా పాజిటివ్‌గా తేలింది. అయినా బోరిస్ జాన్సన్‌కు సెల్ఫ్ ఐసోలేషన్ అవసరం లేదని బ్రిటన్ ప్రధాని అధికారిక కార్యాలయం డౌన్ స్ట్రీట్ స్పష్టంచేసింది.

బ్రిటన్ ప్రధాని బుధ, గురువారాల్లో ఫిఫేలోని ఓ పోలీస్ కాలేజీని, అబెర్డీన్ షైర్‌లోని ఓ విండ్‌ఫామ్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి తిరిగిన సిబ్బందిలో ఒకరు శుక్రవారం స్కాట్లాండ్‌కు వెళ్లిరాగా కరోనా నిర్ధారణ పరీక్షలు చేశారు. పరీక్షల్లో అతనికి కరోనా పాజిటివ్‌గా తేలినా ప్రధానికి ఐసోలేషన్ అక్కర్లేదని డౌన్ స్ట్రీట్ పేర్కొంది. అన్ని రకాల కొవిడ్ నిబంధనలు పాటిస్తూనే ప్రధాని పర్యటనలు కొనసాగు తున్నాయని, సిబ్బందిలో ఏ ఒక్కరితోనూ ప్రధాని క్లోజ్ కాంటాక్ట్‌లో ఉండే అవకాశం లేదని డౌన్ స్ట్రీట్ సిబ్బంది వెల్లడించారు.

కాబట్టి సిబ్బందిలో ఎవరికి కరోనా పాజిటివ్ వచ్చినా ప్రధానికి ఐసోలేషన్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు. అయితే దీనిపై ప్రతిపక్ష లేబర్ పార్టీ విమర్శలు గుప్పిస్తున్నది. అధికార కన్జర్వేటివ్ పార్టీ నేతలు ప్రజలను ఫూల్స్‌ను చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ నేతలు తమకు ఓ రూల్, దేశ ప్రజలందరికీ ఒక రూల్‌ను అమలు చేస్తున్నారనడానికి ఇది కూడా ఒక ఉదాహరణ అని చెప్పారు.

ఇండియాకు మరో పతకం.. రెజ్లర్ భజరంగ్ పూనియాకు కాంస్యం



టోక్యో, ఆగష్టు 7: అనుకున్నట్లే మెడల్ ఫెవరేట్ భజరంగ్ పూనియా పతకం సాధించాడు. టోక్యో ఒలింపిక్స్ 65 కేజీల ఫ్రీస్టైల్‌లో భజరంగ్ బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. కాంస్య పతకం కోసం సాగిన మ్యాచ్‌లో భజరంగ్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి 8-0 తేడాతో మెడల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. బ్రాంజ్ మెడల్ కోసం జరిగిన మ్యాచ్‌లో కజకస్తాన్‌కు చెందిన దౌలత్ నియాజ్‌బెకోవ్‌తో ఇండియన్ స్టార్ రెజ్లర్ భజరంగ్ పూనియా పోటీపడ్డారు.

ఫస్ట్ పీరియడ్‌లో భజరంగ్ మొదట ఓ పాయింట్ సాధించాడు. రెండుసార్లు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మెడల్ కొట్టిన దౌలత్.. ఈ మ్యాచ్‌లో భజరంగ్‌కు గట్టి పోటీ ఇచ్చాడు. చాలా టైట్‌గా ఇద్దరూ కుస్తీపడ్డారు. ఫస్ట్ పీరియడ్ ముగింపులో మరో పాయింట్‌ను భజరంగ్ తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో ఆ పీరియడ్‌లోకి అతనికి 2-0 లీడ్ వచ్చింది. సెకండ్ పీరియడ్ కూడా రసవత్తరంగా సాగింది. అయితే ఆ పీరియడ్ ఆరంభంలోనే భజరంగ్ రెండు పాయింట్లు సాధించాడు. ఆ తర్వాత వరుసగా రెండేసి పాయింట్లను రెండు సార్లు సాధించిన పూర్తి ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. ఆ పీరియడ్‌లో ఆరు పాయింట్లు గెలిచాడు. దీంతో భారత్ ఖాతాలో ఆరు పతకాలు చేరాయి. దీంట్లో రెండు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

హలో బహుజన-చలో నల్గొండ..!

సంగారెడ్డి ఆగస్టు 7 (నేటినిజం ప్రతినిధి) శనివారం సంగారెడ్డి హెడ్ క్వార్టర్ లోని, ఐ.బి ప్రాంగణం లో జిల్లా బహుజన నాయకుల ఆధ్వర్యంలో రేపు నల్గొండ లో జరగబోయే సభ వాల్ పోస్టర్లు విడుదల చేసి సంగారెడ్డి జిల్లా బహుజన వాదులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునివ్వడం జరిగింది.

కార్యక్రమంలో టి.జి.పి.ఏ రాష్ట్ర మహిళ నాయకురాలు లలిత, టి.జి.పి.ఏ జిల్లా అధ్యక్షులు వినోద్, స్వేరోస్ జిల్లా జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ సంచులు, స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షులు తొగర్పల్లి రత్నం, స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ జిల్లా జనరల్ సెక్రెటరీ కందుకూరి కృష్ణ, ఫిట్ ఇండియా ఫౌండేషన్ టి కృష్ణ, జన జాగృతి సేన ఫౌండర్ బంగారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ యూనిఫాంలో వచ్చి రూ 1.12 కోట్లు కొల్లగొట్టిన దోపిడీ ముఠా అరెస్ట్!

ముంబై, ఆగష్టు 7:: పోలీసులుగా ఫోజులు కొడుతూ బస్సు ప్రయాణీకుల నుంచి రూ 1.12 కోట్లు లూటీ చేసిన ముగ్గురు నిందితులను పుణే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను రాందాస్ భోసలే (30), తుషార్ తంబే (22), భరత్ బంగర్(36)గా గుర్తించారు. ముగ్గురు నిందితులు షిరూర్‌కు చెందిన వారని పోలీసులు వెల్లడించారు. ఈనెల మొదటి వారంలో లాతూర్ నుంచి ముంబైకి వెళుతున్న బస్సులో ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్ట్ 3న ముగ్గురు నిందితులు పోలీస్ యూనిఫాం ధరించి పుణే-షోలాపూర్ హైవేపై బస్సును అడ్డగించి అందులో ప్రయాణిస్తున్న కొరియర్ సంస్థ ఉద్యోగుల నుంచి రూ కోటికి పైగా నగదును దోపిడీ చేసి పరారయ్యారు.

బాధితుల్లో ఒకరైన హితేంద్ర జాదవ్ పుణే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలం నుంచి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న నిందితులను ఖరాది బైపాస్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. బాధితుడు మరో ముగ్గురు సహచరులు కొరియర్ కంపెనీల్లో పనిచేస్తూ లాతూర్ నుంచి ముంబైకి భారీ మొత్తంలో నగదును తరలిస్తున్నారు. పోలీసు యూనిఫాంలో బస్సులోకి ప్రవేశించిన నిందితులు కొరియర్ ఉద్యోగులను తనిఖీ పేరుతో బయటకు దింపి వారిపై దాడి చేసి నగదుతో ఉడాయించారు. నిందితుల నుంచి పోలీసులు చెరుకుతోటలో దాచిన రూ 85 లక్షల నగదు, రూ ఏడు లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి ఓ కారు, రెండు బైక్‌లు, రెండు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు సీజ్ చేశారు.

దాతృత్వాన్ని మానవత్వాన్ని చాటిన లయన్స్ క్లబ్ సభ్యులు

ఇర్ఫాన్ చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించిన లయన్స్ క్లబ్ సభ్యులు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి): కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ కొద్ది రోజుల నుండి వింత నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం లో బ్రతుకుపోరు చేస్తున్న అతనికి చికిత్స చేయించుకోవడానికి స్థోమత లేకపోవడంతో దాతల ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు .ఇర్ఫాన్ దైన్యస్థితి తెలుసుకొన్న వేములవాడ లయన్స్ క్లబ్ సభ్యులు వెంటనే స్పందించి అతని కుటుంబానికి శుక్రవారం రూ. 16500 ఆర్థిక సాయం అందించారు .ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు చిన్న వయసులోనే వింత వ్యాధి సోకడం బాధాకరమని, ఇర్ఫాన్ చికిత్స కోసం దాత లు మానవత్వంతో ముందుకురావాలని కోరారు. విషయం తెలుసుకొని చికిత్స కోసం ఆర్థిక అందించిన లయన్స్ క్లబ్ సభ్యులకు ఇర్ఫాన్ కుటుంబసభ్యులు,గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ , ఎడ వె ల్లి రాజశేఖర్, ప్రశాంత్ ముఖ్య ప్రతినిధులు గోగికర్ శ్రీనివాస్,రఫీక్, తీగల వెంకన్న తదితరులు ఉన్నారు ..

దళిత బంధు పథకం దేశానికి దిక్సూచి కాబోతుంది

-దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దళిత బందు
-ఆగస్టు 16న దళితబందు సభా ఏర్పాట్లపై మంత్రుల ఉన్నతస్థాయి సమావేశం
-రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్
-సాచురేషన్ మోడ్లో చేపట్టిన పథకం దళితబందు
-పారదర్శకంగా దళిత బంధు లబ్ధిదారుల ఎంపిక - మంత్రి కొప్పుల ఈశ్వర్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి): ఈనెల 16న హుజురాబాద్ నియోజకవర్గం లో ప్రారంభించనున్న దళిత బంధు పథకం దేశానికి దిక్సూచి కాబోతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి హుజురాబాద్ పర్యటన ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ,సామాజికంగా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకం ఈనెల 16న హుజురాబాద్ నియోజవర్గంలో ఆవిష్కరించనున్నట్లు మంత్రి తెలిపారు . దళిత బంధు పథకం దేశానికి ఆదర్శం కాబోతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా ఒక మంచి సంకేతం ఇవ్వబోతుంది అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి మంచి ఫలితాలు సాధించిందన్నారు. దేశంలో రైతులకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతు బంధు, రైతు భీమా, ఆసరా పింఛన్లు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని అన్ని విభాగాలకు చెందినఅధికారులు సమన్వయంతో పనిచేసి వివిధ విజయవంతం చేయాలన్నారు. సమావేశానికి వచ్చే ప్రజలకు, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. సభాస్థలి , పార్కింగ్, సానిటేషన్ , ట్రాగునీటి కి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. సభాస్థలి ప్రాంగణంలో శానిటేషన్ పనులను చేపట్టాలని పంచాయతీ అధికారి ని ఆదేశించారు. సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చే లబ్ధిదారులను తీసుకు వచ్చేందుకు తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని రీజనల్ మేనేజర్ ఆర్టీసీ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని పోలీసు శాఖను ఆదేశించారు.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఈనెల 16న హుజురాబాద్ లో ప్రారంభించనున్న దళిత బంధు కార్యక్రమం విజయవంతానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. దళిత బంధు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. దళితుల ఆర్థిక స్థితిగతులు మార్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వేల కోట్లు వెచ్చిస్తున్నారని అన్నారు , ప్రభా స్థలి వేదిక ,పార్కింగ్ కు, ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసు అధికారులనుఆదేశించారు. .గొప్పగా ఆలోచించి దళితవర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబందు కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇన్నేళ్లలో రాలేదన్నారు. ఎలాంటి ఇబ్బందుల జరగకుండా ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి అందరూ టీం వర్క్ గా పనిచేయాలన్నారు.

ఈనెల 16న నిర్వహించబోయే దళితబందు సభకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి సబను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, శ్యామ్ లాల్ ప్రసాద్,ఆర్టీసీ రిజినల్ మేనేజర్, పోలీస్ ఉన్నతాధికారులతో పాటు అన్ని ముఖ్య శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

ఆన్‌లైన్‌లో రైల్వే స్మార్ట్‌కార్డు రీచార్జ్

న్యూఢిల్లీ, ఆగష్టు 7: స్మార్ట్‌కార్డు యూజర్స్‌కు రైల్వేశాఖ శుభవార్త చెప్పింది. స్మార్ట్‌కార్డు ఉన్న ప్రయాణికులు ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే తమ కార్డులను రీచార్జ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు రైల్వే శాఖ ఒక ప్రకటన చేసింది. తాజా వెసులుబాటుతో స్మార్ట్‌కార్డు ఉన్న ప్రయాణికులు 'జు నీనిఎనీఎతిశ్రీవ' వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా తమ కార్డులను ఆన్‌లైన్‌లో రీఛార్జ్ చేసుకునే అవకాశం లభిస్తుంది.

దీనిపై దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ.. గతంలో స్మార్ట్‌కార్డులో బ్యాలెన్స్ అయిపోతే ప్రయాణికులు రీచార్జ్ కోసం బుకింగ్ కౌంటర్స్ దగ్గరికి రావాల్సి వచ్చేదని, గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వచ్చేదని చెప్పారు. దానివల్ల స్మార్ట్‌కార్డు యూజర్ సమయం ఎక్కువగా వృథా అయ్యేదన్నారు. ఆ సమస్యకు పరిష్కారంగానే ఇప్పుడు ఆన్‌లైన్‌లో స్మార్ట్ కార్డ్ రీచార్జ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

తాజా సదుపాయంతో బుకింగ్ కౌంటర్ల దగ్గర రద్దీ కూడా తగ్గుతుందని రైల్వే అధికారులు చెప్పారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో బుకింగ్ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గడంవల్ల చాలా ప్రయోజనం ఉంటుందన్నారు. కౌంటర్ల వద్ద రద్దీని నివారించడానికి స్మార్ట్ కార్డ్ వినియోగదారులంతా ఆన్‌లైన్ పద్ధతిని వాడుకోవాలని సూచించారు. ఈ కొత్త సౌకర్యాన్ని ప్రయాణికులు స్వాగతిస్తారని ఆశిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్య చెప్పారు.

నేతన్నల కష్టాలను కళ్లారా చూశా- ఏపి సీఎం

అమరావతి, ఆగష్టు 7:జాతీయ చేనేత దినోత్సవం. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు సీఎం జగన్ శుభాకాంక్షలు తెలియజేశారు. తాను గతంలో చేపట్టిన 3648 కిలోమీటర్ల పాదయాత్రలో చేనేత కార్మికుల కష్టాలను కళ్లారా చూశానని తెలిపారు. వారి బాధలు తాను విన్నానని పేర్కొన్నారు. అందుకే, తాము అధికారం లోకి రాగానే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులైన వారికి ఏటా రూ.24 వేలు ఇస్తున్నామని, తద్వారా వారికి అండగా ఉంటున్నామని వివరించారు.

కరోనాపై పోలీసులు అవగాహన

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి): జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కళాబృందాం మరియు సఖీ వారు శనివారం జిల్లా లోని ఇల్లంతకుంట మండలంలో సి.ఐ ఉపేందర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు..ఇందులో భాగంగా కరోనా నివారణపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వం లాక్ డౌన్ తొలగించిన నేపథ్యంలో, కరోనా అంటువ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని పోలీస్ కళా బృందం అవగాహన కల్పిస్తూ మాస్కు ధరించడం, భౌతిక దూరం పాటించడంతో పాటుగా చేతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కళా బృందం సభ్యులు ప్రజలకు తెలియజేశారు.మరియు సైబర్ నెరలపై మూఢ నమ్మకాలపై రోడ్ ప్రమాధాలపై వివిధ ప్రాంతాలలో ఆట పాటల ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు..ఈ కార్యక్రమంలో ఎస్సై ర ఫిక్ ఖాన్ , ప్రొఫెషనల్ ఎస్సై దిలీప్,సర్వీస్ సెంటర్ అంజలి, కళాబృందం ఇన్చార్జ్ సతీష్ చరణ్ సభ్యులు పాల్గొన్నారు .

ఈ కార్యక్రమంలో ఎస్.ఐ లు రఫిక్ ఖాన్,దిలీప్ కళాబృందం సభ్యులు సఖీ సెంటర్ సభ్యులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ప్రభుత్వం నేతన్నలకు అన్ని విధాలా చేయూతనిస్తుంది..!

-ముడిసరుకు మొదలుకొని ఉత్పత్తుల వరకు వివిధ రాయితీలు ఇస్తూ , సహాయ సహకారాలు అందిస్తుంది - జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, ఆగస్టు 7 (నేటినిజం ప్రతినిధి) శనివారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ఐటిఐ కళాశాల గ్రౌండ్స్ నుండి కలెక్టరేట్ వరకు చేనేత సహకార సంఘాల ప్రతినిధులు నేత కార్మికులతో నిర్వహించిన హ్యాండ్లూమ్ వాక్‌ను పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ హనుమంతరావు జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత రంగాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం ప్రతి మగ్గాన్ని జియో ట్యాగింగ్ చేసిందన్నారు. చేనేత కార్మికులు ఇతర రంగాలకు వెళ్లకుండా చేనేతకు పూర్వవైభవం తెచ్చేలా ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. జిల్లాలోని చేనేత సహకార సంఘాలు తమ ఉత్పత్తులను అమ్ముకునే విధంగా కలెక్టరేట్లో ప్రతి సోమవారం స్టాల్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిస్తామని తెలిపారు.

జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావ్ మాట్లాడుతూ చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం నేత కార్మికులకు ముడిసరకు మొదలు మార్కెటింగ్ వరకు అవసరమైన సదుపాయాలు సమకూరుస్తునదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మన దగ్గర తయారయ్యే వస్తువులు కొనేలా చొరవ చూపాలన్నారు. నేతన్నకు చేయూతనిచ్చేలా ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు.

అదనపు కలెక్టర్ వీరా రెడ్డి మాట్లాడుతూ చేనేత కళ అంతరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమ అభివృద్ధికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. చేనేత రంగంలో టెక్నాలజీ పెంపొందిందని, చేనేత కార్మికులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. మన రాష్ట్రంలో తయారవుతున్న వస్త్రాలు ప్రపంచ వ